నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, ఆదివారం 6 ఏప్రిల్ 2025 | SIDDIPET

పూర్తిస్థాయిలో సన్‌ఫ్లవర్ కొనాలి

- ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించాలి
- వ్యవసాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేసిన హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 5: సిద్దిపేట జిల్లాలో సన్‌ఫ్లవర్ రైతులు ఆందోళనలో ఉన్నారని, కొనుగోలు కేంద్రాలు కొనసాగించి పూర్తిస్థాయిలో పంట సేకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఫోన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. సన్‌ఫ్లవర్ కొనుగోలు చేయడం లేదని చిన్నకోడూరు మండల రైతులు ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి ఆయన వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఫోన్‌చేసి మాట్లాడారు. జిల్లాలో మొత్తం పంటను కొనుగోలు చేయాలని కోరారు. వెంటనే కొనుగోలు కేంద్రాల్లో తూకాలు వేయాలని విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట నియోజకవర్గం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని మంత్రిని కోరారు. ఆయిల్‌పామ్ లాభదాయకమైన పంట అని, ఖమ్మం రైతుల స్ఫూర్తితోనే సిద్దిపేట జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారని, వారిని ప్రోత్సహించాలని కోరారు.

ఆదర్శప్రాయుడు శ్రీరామచంద్రుడు

జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు: హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 5: అందరికీ ఆదర్శప్రాయుడు శ్రీరామచంద్రుడు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు.శనివారం శ్రీరామనవమి సందర్భంగా ప్రజలకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. 'హక్కుల కంటే బాధ్యత గొప్పదన్నది రామతత్వం! కష్టంలో కలిసి నడవాలన్నది సీతతత్వం' అని పేర్కొన్నారు. శ్రీరాముడు కష్టాల్లో మనో నిబ్బరం కోల్పోకుండా ముందుకు సాగి విజయం సాధించారన్నారు. శ్రీరాముడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మానవ అవతార మూర్తులైన సీతారాములు ధర్మసంస్థాపనకు నిలువుటద్దంగా నిలిచారన్నారు. శ్రీరాముడి అనుగ్రహంతో జిల్లా అన్నిరంగాల్లో పురోభివృద్ధిని సాధించాలని, ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడి పంటలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు హరీశ్‌రావు ప్రకటనలో పేర్కొన్నారు.

హైడ్రా బూచి.. అందినకాడికి దోచి!

ఎన్‌వోసీ జారీకి ఇరిగేషన్ అధికారుల డబ్బుల డిమాండ్

- హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో నిర్మాణాలకు ఎన్‌వోసీ తప్పనిసరి
- జలవనరులకు సమీపంలో లేదని ఇరిగేషన్ శాఖ ఎన్‌వోసీ జారీ
- నీటి కాలువలు, నాలాల సమీపంలో ఉన్నా ఎన్‌వోసీ తప్పనిసరి
- రెవెన్యూ, ఇరిగేషన్ జాయింట్ సర్వే తర్వాతే జారీ
- దరఖాస్తు చేసుకోగానే వాలిపోతున్న బ్రోకర్లు.. వారు చెప్పిన రేటే ఫైనల్
- పటాన్‌చెరు నియోజకవర్గంలో వందలాది దరఖాస్తులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 5: హైడ్రా బూచి పేరుతో కొందరు ఇరిగేషన్ అధికారులు ఎన్‌వోసీ జారీకి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. హైడ్రా పేరు చెబితే అక్రమార్కుల సంగతేమో కాని చెరువులు, కుంటలు, నాలాలకు సమీపంలో ఇండ్లు కట్టుకున్న వారికి నిద్ర కరువవుతున్నది. జలవనరుల్లో కానీ, ఎఫ్‌టీఎల్‌లో కానీ, బఫర్ జోన్‌లో కూడా లేని ఇండ్లకు సైతం అధికారులు ఎన్‌వోసీలు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్జెంట్‌గా ఇండ్లు, ప్లాట్లు, భూములు అమ్ముకుందామనుకుంటే అమ్మకందారులకు ఎన్‌వోసీ తప్పనిసరిగా మారింది. ఎన్‌వోసీ ఇవ్వడానికి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే పేరిట జాప్యం చేస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసిందే ఆలస్యం, దరఖాస్తుదారుల వద్దకే ఇరిగేషన్ శాఖకు చెందిన బ్రోకర్లు, సిబ్బంది వచ్చి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. వారు అడిగింది ఇస్తే దరఖాస్తు వేగంగా పరిష్కారమై చేతికి ఎన్‌వోసీ అందజేస్తున్నారు. రూల్స్ మాట్లాడితే ఇక అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. వారం రోజులైనా, నెలలైనా దరఖాస్తుపై స్పందించడం లేదు. మళ్లీ బ్రోకర్‌ను, ఇరిగేషన్ శాఖ సిబ్బందిని కలిసి అడ్వాన్స్ ఇస్తే ఫైల్ ముందుకు కదులుతుంది. సగం డబ్బులు ఇస్తే జాయింట్ సర్వే జరుగుతుంది. అడిగినంత సొమ్ము అందజేస్తే ఎన్‌వోసీ అందజేస్తున్నారు. కింది నుంచి పైస్థాయి వరకు ఈ ఎన్‌వోసీ జారీ ప్రక్రియలో డబ్బులే కీలకం అవుతున్నాయి. ఎవరు డబ్బులు ఇవ్వకున్నా, రిక మెండేషన్ తెచ్చినా పనికావడం లేదు. పైసలిచ్చి పనిచేయించుకోమని సిబ్బంది సూచిస్తున్నారు. అన్నీ కరెక్టు ఉన్నాయని మాట్లాడితే ఏదో ఒక కొర్రీ పెట్టి ఎన్‌వోసీ ఇవ్వలేమని దరఖాస్తుకు రిమార్క్ పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో, లేదా పాత మ్యాపులో సమస్య వచ్చిందని నిర్దాక్షణ్యంగా చెబుతున్నారు. ఆ తర్వాత ఆ ఆస్తి విలువ మార్కెట్‌లో సగానికి సగం పడిపోతున్నది. రూ.కోట్లు పలకాల్సిన ప్లాట్లు, భూములకు లక్షలు కూడా పలకడం లేదు. ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖలు రిజెక్ట్ చేశాయంటే, త్వరలో ఆ ప్రాపర్టీని హైడ్రాతో కలిసి కూల్చేస్తారని, గుంజుకుంటారనే భయాందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మార్కెట్‌లో బద్నాం అయితే పెట్టిన డబ్బులు రావని ప్లాట్ల ఓనర్లు, భూముల యజమానులు బెంబేలెత్తి డబ్బులు ముట్టజెబుతున్నట్లు తెలిసింది.

బఫర్ పేరున వసూళ్లు...

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారం మండలాల్లో వందలాది చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో సగం చెరువులు, కుంటల చుట్టూ కాలనీలు వెలిశాయి. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న ప్రాంతం కావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. కాలనీల్లో చెరువుల సమీపంలో ఇండ్లు నిర్మించుకున్న వారికి, నాలాలకు, కాలువలకు సమీపంలో ఉన్నవారు భూములు, ఇండ్లు అమ్మకోవాలన్నా, బ్యాంకు లోన్‌కు వెళ్లాలన్నా, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా హైడ్రా భయం లేకుండా నీటిపారుదల శాఖ నుంచి ఎన్‌వోసీలు పొందాల్సి ఉంటుంది. చాలా చెరువులు, కుంటలు, వాగుల చుట్టూ వేలాది ఇండ్లు నిర్మించుకోవడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఎన్‌వోసీలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందికి, అధికారులకు వరంలా మారింది. వచ్చిన దరఖాస్తులను ఇరిగేషన్ అధికారులతో పాటు రెవెన్యూ శాఖ సర్వేయర్లు జాయింట్ సర్వే చేసి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇరిగేషన్‌శాఖ ఏఈ, సర్వేయర్లు సైట్‌కు వచ్చి ఆన్‌లైన్‌లో డిజిటల్ మ్యాపును, నిజాం కాలంనాటి పాత మ్యాపులను పరిశీస్తారు. ఎఫ్‌టీఎల్‌లో ఉంటే నిరాకరిస్తారు. కానీ, బఫర్ జోన్‌లో ఉంటే, బఫర్ జోన్‌కు అతి దగ్గరగా ఉన్నా బేరాలు ప్రారంభిస్తారు. వంద గజాలకు రూ.లక్షకు మించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్ని వందల గజాలుంటే అన్ని రూ.లక్షలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు న్యాయంగా పనిచేస్తూ ప్రజల మెప్పు పొందుతున్నారు. కానీ, అధికశాతం ఇరిగేషన్ శాఖ సిబ్బంది, అధికారులు డబ్బులు ఇస్తేనే పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హైడ్రా బూచి చూపి ఒక్కో ప్లాటుపై రూ.లక్షలు వసూలు చేస్తున్నారంటే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోంచి వచ్చిన ఎన్‌వోసీ దరఖాస్తుల విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. శుక్రవారం ఏసీబీ అధికారుల పటాన్‌చెరు ఇరిగేషన్ డీఈ కార్యాలయం ఎదుట లంచం తీసుకుంటున్న గుమ్మడిదల నీటిపారుదల ఏఈని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. అక్కడి నుంచి ఆఫీసుకు వచ్చి తనిఖీ నిర్వహించేందుకు ఏసీబీ సమాయత్తం అవుతున్న విషయం తెలిసి ఇరిగేషన్ ముఖ్య అధికారి అక్కడి నుంచి జారుకున్నారని సమాచారం. ఆ ముఖ్య అధికారి టార్గెట్‌గా ఏసీబీ రైడ్ జరిగిందని వార్తలు ప్రచారంలో ఉన్నాయి. తృటిలో తప్పించుకున్న ఆ అధికారిపై అవినీతి ఆరోపణలు చాలా ఉన్నాయి. లంచం డబ్బులు ఒక్కరే మాట్లాడుతారని, కానీ.. అవినీతి అధికారులు అందరికీ వాటాలు వెళ్తాయని ప్రచారంలో ఉంది.



కొల్చారం శివారులో నీరులేక ఎండిపోయిన వరిపొలంలో పశువులను మేపిన దృశ్యం



కౌడిపల్లి మండలం తునికిపల్లిలో ఎండిన వరిపొలంలో మేత మేస్తున్న పశువులు

[వేలాది ఎకరాల్లో ఎండిన పంటలు]

మెతుకుసీమలో.. అన్నదాతకు వరిగోస

మెదక్ జిల్లాలో 2.58 లక్షల ఎకరాల్లో వరిసాగు

మెదక్ జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భ జలాలు అడుగంటి యాసంగిలో వేలాది ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. ఈ ఏడాది చెరువులు, కాలువల్లో నీరు నిండుగా ఉండడంతో యాసంగిలో బోరుబావుల కింద రైతులు ధైర్యంతో వరి పంట వేశారు. పంట చేతికొచ్చే సమయానికి బోరుబావుల నుంచి నీళ్లు రాక వరి పంట ఎండిపోయింది. జిల్లాలో 1.50 లక్షల వ్యవసాయ కరెంట్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ యాసంగి సీజన్‌లో 2.58 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. ఇందులో బోర్ల కింద 2.10 లక్షల ఎకరాలు, కెనాల్స్ కింద 42 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్టు అధికారులు తెలిపారు. మక్క 2196 ఎకరాలు, జొన్న 3908 ఎకరాలు, శనగలు 143 ఎకరాలు, ఇంతర పంటలు 790 ఎకరాల్లో సాగుచేశారు. పంటలు ఎండిపోవడం, బోర్లు వేసి అప్పుల పాలుకావడం, ప్రభుత్వం నుంచి చేయూత లభించక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కుషన్‌గడ్డ తండాలో మార్చి 21న పంట ఎండిపోవడంతో మూడు బోర్లు వేయించినా నీళ్లు పడకపోవడంతో రైతు పాల్త్య జీవుల (50) ఆత్మహత్య చేసుకున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మెదక్ జిల్లాలో రైతు ఆత్మహత్యలు విపరీతంగా చోటుచేసుకుంటుడడం అందరినీ కలవరపెడుతున్నది.

- అడుగంటిన భూగర్భ జలాలతో పంటలకు తీవ్రనష్టం
- నెల వ్యవధిలో మీటరు మేర పడిపోయిన నీటిమట్టం
- వేధిస్తున్న కరెంట్ సమస్యలు
- ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు

మెదక్, ఏప్రిల్ 5(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో మెదక్, కౌడిపల్లి, వెల్దుర్తి, కొల్చారం, రామాయంపేట, నిజాంపేట, చేగుంట, మాసాయిపేట, పాపన్నపేట, హవేళీఘనపూర్ మండలాల్లో వరి పంట అధికంగా ఎండుముఖం పట్టింది. పంటలను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజులుగా భూగర్భ జలాలు వేగంగా పడిపోవడంతో వరి పంటకు బాగా దెబ్బతిన్నది. పంటలను కాపాడుకోవడానికి రైతులు అబోర్లు తవ్వించి అప్పుల పాలవుతున్నారు. అయినా నీళ్లుపడక పంటలు ఎండిపోతుండడంతో రైతులు గొర్రెలు, పశువులకు మేతగా వదిలేస్తున్నారు. కొంతమంది రైతులు కిలోమీటర్ల కొద్ది కాలువలకు పైపులు వేసుకొని నీళ్లు పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. బోర్ల ఆధారంగా సాగుచేసిన చోటనే ఎక్కువగా పంటలు ఎండిపోయాయి. ఎండిపోయిన పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పంటలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తున్నామని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ తెలిపారు. 350 ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు అధికారులు తెలిపారు. కానీ, వేలాది ఎకరాల్లో పంటలు ఎండినట్లు రైతులు, రైతు నాయకులు చెబుతున్నారు.

కౌడిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలో ఎండిపోయిన వరి పొలం

మెదక్ జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. జనవరిలో సాధారణ నీటిమట్టం 10.94 మీటర్లు కాగా, ఫిబ్రవరి నెలలో 13.25 మీటర్లకు పడిపోయింది. అంటే భూగర్భ జలాలు దాదాపు – 0.99 మీటర్ల లోతుల్లోకి వెళ్లాయి. ఈసారి వర్షాకాలంలో సాధారణ వర్షపాతమే నమోదైంది. ఒకేసారి దంచికొట్టిన వానలతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండాయి. ఆ తర్వాత వర్షాలు కురవలేదు. జిల్లాలో చాలా చెరువులు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం ప్రమాదకర స్థాయికి చేరింది. ఇప్పటికే మెదక్, నర్సాపూర్, తూప్రాన్ డివిజన్‌ల్లో బోర్లు ఎత్తిపోతుండగా, నీటిబావులు ఎండిపోతున్నాయి. దీంతో బోరుబావుల కింద వేసిన పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయి. రోజురోజుకూ ఎండలు ముదరడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోనూ నీరు తగ్గుముఖం పడుతోంది. జిల్లాలో అధిక మొత్తంలో వరి సాగు చేయడంతో నీటి వాడకం పెరగడంతో భూగర్భ జలాలు వేగంగా తగ్గుముఖం పట్టాయి. నెల వ్యవధిలోనే జిల్లాలో సరాసరిగా 1 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. నీటి వాడకం ఇదేవిధంగా కొనసాగితే ఏప్రిల్, మేలో భూగర్భ జలాలు మరింత పడిపోయే అవకాశం ఉంటుందని, దీంతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతాయని సంబంధిత శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

పాతాళానికి పడిపోయిన భూగర్భ జలాలు..

కొండారెడ్డిపల్లి రైతు కంట కన్నీరు

- గ్రామంలో 600 ఎకరాల్లో వరి సాగు
- నీళ్లందక ఎండుతున్న పంటలు
- తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు

నీళ్లులేక ఎండిపోయిన సింగూరు ఎడమ కాల్వ

కొండారెడ్డిపల్లిలో ఎండిన పంటలను చూపుతున్న రైతులు

అందోల్, ఏప్రిల్ 5: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని కొండారెడ్డిపల్లిలో వందలాది రైతు కుటుంబాలు సింగూరు వరద కాల్వను నమ్ముకునే వ్యవసాయం చేస్తున్నాయి. ఈ గ్రామంలో ఈ యాసంగిలో 600 ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. మరికొద్ది రోజుల్లో పంట కోతకొస్తుంది. కానీ, సరిగ్గా ఇదే సమయంలో సింగూర్ ఎడమకాల్వకు మరమ్మతుల పేరిట నీటిని వదలమని ఇరిగేషన్ అధికారులు చెప్పడంతో రైతుల నెత్తిపై పిడుగుపడ్డట్టైంది. పోనీ చెరువు నీటితోనో..? బోర్ల ద్వారా అయినా పంటలకు పారకం పెట్టి కాపాడుకుందామంటే భూగర్భ జలాలు అండుగంటి బోర్లు పోయడం లేదు. చెరువులు ఎండిపోవడంతో రైతులు ఎంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంటలు ఎండుతుండడంతో నీళ్లు వదలండి సార్ అంటూ సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. పంటలు వేయవద్దని మీకు ముందే చెప్పామని, అయినావేశారని.. ఇక మీచావు మీరు చావండి...కాల్వకు మరమ్మతులు అయ్యేదాకా నీళ్లు వదిలేది లేదంటూ అధికారులు కసురుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. కాల్వల మరమ్మతుల గురించి అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదని, కనీసం మీటింగ్‌లు నిర్వహించి చెప్పలేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు నిజంగా తమకు సమాచారం ఇస్తే ఎందుకు పంటలు సాగు చేస్తామని, ఎందుకు ఎండబెట్టుకుంటామని రైతులు ప్రశ్నిస్తారు. మరో వారం పదిరోజుల్లో పంటలు కోతకు వస్తాయని, ఒక్క తడి నీళ్లు అందించినా బయట పడుతామని, ప్రభుత్వ స్పందించి సంబంధిత అధికారులకు నీళ్లు వదిలేలా ఆదేశాలివ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 20.927 టీఎంసీల నీళ్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారని, ఈ ఒక్కసారి నీళ్లు వదలాలని వేడుకుంటున్నారు. ఇప్పటికే సగం పంటలు ఎండి పశువులకు మేతగా మారాయని, రెండు, మూడు రోజుల్లో తడి అందక పోతే పూర్తి పంటలు ఎండుతాయని, అదే జరిగితే తమకు చావే దిక్కంటున్నారు రైతులు.

పదేండ్లు ఎంతో సంతోషంగా బతికినం..

చేతికొచ్చిన పంటలు కండ్ల ముందే ఎండుతూ పశువులకు మేతగా మారుతుంటే ఎంతో బాధగా ఉంది. నాకున్న 2 ఎకరాల భూమిలో గతంలో లెక్కనే వరి సాగుచేసిన. పంట వేసిన తర్వాత అధికారులు మీరు పంట ఎందుకు వేసిండ్రు, కాల్వల ద్వారా నీళ్లు రావని చెప్పినం కదా..? అంటూ చెబుతున్నారు. అన్నట్లుగానే కాల్వల ద్వారా నీటిని ఆపేసిండ్రు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. అధికారులను ఎన్నిసార్లు అడిగినా ఫలితం లేకుండా పోయింది. బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు ఎన్నడూ ఇంత బాధపడ్డది లేదు. మా ఒక్క కొండారెడ్డి పల్లిలోలోనే వందలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయి. సింగూరు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లున్నా అధికారులు మాత్రం వదలడం లేదు.

– బానోత్ శంకర్ నాయక్, రైతు, కొండారెడ్డిపల్లి

వేతనాలు ఇచ్చే వరకు పనులు చేయం

రామాయంపేటలో నిరసనకు దిగిన పారిశుధ్య కార్మికులు

రామాయంపేట, ఏప్రిల్ 5: తమకు ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకుండా, పీఎఫ్ జమచేయకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారని, మున్సిపల్ కమిషనర్ తమ సంక్షేమాన్ని విస్మరించారని రామాయంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం పారిశుధ్య కార్మికులు నిరసనకు దిగారు. శనివారం పనులు మానేసి కార్మికులంతా కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో కమిషనర్ ఇతర కూలీలతో పారిశుధ్య పనులు చేయించారు. ఇది చూసిన కార్మికులు కమిషనర్ కార్యాలయంలోకి వెళ్లి తమకు వచ్చే పీఎఫ్, వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమిషనర్ తమను తిట్టారని విలేకరుల ఎదుట పారిశుధ్య కార్మికులు ఆరోపించారు.

రామాయంపేట మున్సిపాలిటీ ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

సిద్దిపేట యూనియన్ బ్యాంకులో అధికారులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సగం మంది రైతులకే రుణమాఫీ

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం సగమంది రైతులకే రుణమాఫీ చేసి సంపూర్ణంగా చేసిందని ప్రచారం చేసుకుంటున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించి బ్యాంకు అధికారులతో మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలో 2023 నాటిటి 2,09,093 క్రాప్ లోన్ అకౌంట్లు ఉన్నాయని, వీరికి రూ. 2026 కోట్ల పంట రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు. ఇంకా రూ.1000 కోట్ల పంట రుణమాఫీ జిల్లాలో చేయాల్సి ఉందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 40 వేల మంది రైతులకు 20 వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. వ్యాపారం లేక సేవింగ్స్ ఖాతాల్లో నిల్వలు తగ్గినట్లు హరీశ్‌రావు చెప్పారు. సిద్దిపేటలో మూడు రీజినల్ బ్యాంకు శాఖలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్‌బీఐ,యూనియన్ బ్యాంక్, గ్రామీణ వికాస్ బ్యాంకు రీజినల్ కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేసుకున్నామని, దీంతో నిజామాబాద్, వరంగల్ ప్రాంతాలకు వెళ్లే అవసరం తప్పిందన్నారు. దీంతో రైతులు, వ్యాపారులకు మేలు జరుగుతున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాల పట్టివేత

చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న అధికారులు

జహీరాబాద్, ఏప్రిల్ 5: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ–కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 10.30 గ్రాముల కొకైన్ డ్రగ్స్‌ను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుంది. శనివారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ ఆదేశాల మేరకు స్థానిక చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని అనుమానంతో సోదా చేయగా 10.30 గ్రాముల కోకైన్ డ్రగ్స్ లభించింది. వెంటనే అదుపులోకి తీసుకుని ఆయన నుంచి కొకైన్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఏపీలోని కృష్ణా జిల్లా బందుపల్లి మండలం జానకీరాంపూర్‌కు చెందిన చంద్రశేఖర్‌గా గుర్తించారు. అతన్నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శంకర్ తెలిపారు. తనిఖీల్లో అధికారులు కోటేశ్వర్‌రావు, హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

గ్రీన్ చాలెంజ్‌లో మొక్కలు నాటుతున్న రాజేశ్వరరావు

జగదేవపూర్, ఏప్రిల్ 5: భవిష్యత్ తరాల కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సిద్దిపేట హరితసేన ఇన్‌చార్జి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా శనివారం మండలంలోని అలిరాజ్‌పేటకు చెందిన హరితసేన గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనిల్‌రెడ్డి కుమారుడు వశిష్ఠరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, సత్తిరెడ్డి, లోకేశ్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'క్యారం' పోటీలో భార్గవికి బంగారు పతకం

విద్యార్థినీ భార్గవికి కప్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

జహీరాబాద్, ఏప్రిల్ 5: జహీరాబాద్ పట్టణానికి చెందిన ఎలుగొండ భార్గవీ క్యారం బోర్డు పోటీలో బంగారు పతకాన్ని సాధించింది. స్థానిక పట్టణానికి చెందిన ఎలుగొండ భార్గవీ తమిళనాడులోని తిరుచి ఐఐఐటీలో చదువుకుంటుంది. ఇటీవల గ్వాలియర్‌లో జరిగిన అంతర్ రాష్ట్ర క్యారంబోర్డు పోటీలో భార్గవి పాల్గొంది. ఈ పోటీలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించడంపై జహీరాబాద్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జనార్ధన్, విద్యార్థినీ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో రాణించాలని అశాభావం వ్యక్తం చేశారు.